గ్యాస్ సబ్సిడీ నో

మహాలక్ష్మి కింద గ్యాస్ సిలిండర్ తీసుకున్న వారికి సబ్సిడీ డబ్బులు ఖాతాలో జమ కావడం లేదు. దీంతో లబ్ధిదారులు మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



8లో▸



నిధుల్లేక నిలిచిన పనులు

జిల్లాలోని పలు గ్రామాల్లో చేపట్టిన పంచాయతీ భవన నిర్మాణాలు నిధులు లేక నిలిచిపోయాయి. దీంతో పాత భవనాల్లోనే కార్యాలయాలు కొనసాగుతున్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /26.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వాతావరణం చల్లబడుతుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా ఓ మోస్తరు వాన కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన అంగన్‌వాడీలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న టీచర్లు

ఖానాపూర్: ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్‌ను టీఎస్జీవో అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్స్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గుడిసె సంపూర్ణ, ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి, ఖానాపూర్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు లీల తదితరులున్నారు.

బీజేపీ విజయోత్సవ సభ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామంలో బుధవారం బీజేపీ విజయోత్సవ సభ నిర్వహించారు. ఎంపీ గోడం నగేశ్ హాజరై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపించిన నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటానని తెలిపారు. ఎంపీ నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, పార్టీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్, నాయకులు రవీందర్‌గౌడ్, సత్తెన్న, రవీందర్‌రెడ్డి, కృష్ణ, మోహన్‌నాయక్, తిరుమల్, వేణు, ప్రసాద్, సాయికుమార్, మనోజ్, రాజేందర్ తదితరులున్నారు.

నీట్ అవకతవకలపై సమాధానమివ్వాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: నీట్ అవకతవకలపై ప్రధాని మోదీ సమాధానం ఇవ్వాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ డిమాండ్ చేశారు. నీట్‌పై స్పందించాలని పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం సర్కిల్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. గతంలో ఎప్పుడూ లేనట్లు 67మందికి మొదటి ర్యాంకులు రావడం ఎన్నో అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. ఇప్పటికైనా నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ నీట్ చైర్మన్ ప్రదీప్‌కుమార్ జోషి రాజీనామా చేయాలని, పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు పవార్ కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల పరిశీలన



తోటను పరిశీలిస్తున్న అధికారి

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్, బావాపూర్(కే) గ్రామాల్లోని ఆయిల్‌పామ్ తోటలను బుధవారం ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి మౌనిక పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులు ప్రతీ 15 రోజులకోసారి పంట క్షేత్రాలను పరిశీలించాలని తెలిపారు. పంటలో వచ్చే మగ, ఆడ పుష్పాలను గుర్తించి తొలగించాలని పేర్కొన్నారు. తద్వారా మొక్కల ఎదుగుదల సాధ్యమవుతుందని చెప్పారు. ప్రతీ మూడు నెలలకోసారి తాము సూచించిన ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. క్లస్టర్ అధికారి దినేశ్, రైతులు పాల్గొన్నారు.

నేడు హిందూ సామ్రాజ్య దినోత్సవం

నిర్మల్‌టౌన్/నిర్మల్‌ఖిల్లా: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నాయుడివాడ కాలనీలో గల ఆర్యవైశ్య సంఘ భవనంలో గురువారం సాయంత్రం 6గంటలకు హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నగర సంఘచాలక్ డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వక్తగా ఇందూర్ విభాగ్ ప్రచారక్ శివకుమార్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. అధికసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కల నిజమాయె..!



రత్నాపూర్‌కాండ్లీ పాఠశాలలో జాయిన్ అవుతున్న ఫిజికల్ డైరెక్టర్

- 416 మంది ఎస్జీటీలకు ప్రమోషన్లు
- జాబితా విడుదల చేసిన డీఈవో
- ఉపాధ్యాయ వర్గాల్లో సంబురాలు

నిర్మల్ రూరల్: సుదీర్ఘకాలంగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల కల నెరవేరింది. ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌గా ప్రభుత్వం ప్రమోషన్లు కల్పించింది. ఏళ్ల తరబడి ఎస్జీటీలుగా పనిచేస్తున్న అర్హులందరికీ ప్రమోషన్లు దక్కాయి. జిల్లాలో మొత్తంగా 416 మంది ప్రమోషన్లు పొందారు. వీరిలో ఎస్జీటీ నుంచి ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్, తెలుగు పండిత్, హిందీ పండిత్, ఉర్దూ పండిత్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్, ఎస్ఏ గణితం, ఫిజికల్ సైన్స్, ఇంగ్లిష్, బయోసైన్స్, సోషల్ స్టడీస్‌గా ప్రమోషన్లు పొందారు. తొమ్మిదేళ్లుగా ఎస్జీటీలు, పదహారేళ్లుగా పీఈటీలు, భాషా పండితులు ప్రమోషన్ కోసం నిరీక్షించారు. కోర్టు కేసు కారణంగా భాషా పండితులు, పీఈటీలకు ప్రమోషన్లు రాలేదు. అయితే ఇటీవల సుప్రీంకోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో రాష్ట్ర ప్రభుత్వం వారి పోస్టులను అప్‌డేట్ చేస్తూ ప్రమోషన్లు కల్పించింది. దీంతో వారిలో హర్షం వ్యక్తమవుతోంది. సోమవారం ఉదయం నుంచే ఉత్తర్వుల కోసం ఎదురుచూడగా బుధవారం తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో విద్యాశాఖ ఆర్డర్ కాపీలను ఆన్‌లైన్‌లో పొందుపరిచింది.

416 మందికి ఉద్యోగోన్నతి..

జిల్లాలో 416 మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్లు దక్కాయి. లోకల్‌బాడీలో 391 మందికి, ప్రభుత్వ యాజమాన్యంలో 25 మందికి ప్రమోషన్లు వచ్చాయి. ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్‌గా 52 మంది, ఎస్ఏ ఇంగ్లిష్–2, ఎస్ఏ గణితం–24, ఎస్ఏ హిందీ–92, ఎస్ఏ తెలుగు–103, ఎస్ఏ ఉర్దూ–4, ఎస్ఏ బయోసైన్స్–40, ఫిజికల్ డైరెక్టర్–27, ఎస్‌సీఏ ఫిజికల్ సైన్స్–7, ఎస్ఏ సోషల్ స్టడీస్–62, స్పెషల్ ఎడ్యుకేషన్–3 మంది ఉద్యోగోన్నతి పొందారు. వీరంతా బుధవారం పాఠశాల నుంచి రిలీవై కొత్త పాఠశాలలో జాయిన్ అయ్యారు.

నెరవేరిన కల

ఎన్నో ఏళ్లుగా ప్రమోషన్ పొందాలన్నా ఉపాధ్యాయుల కల నెరవేరింది. గతంలో మూడుసార్లు దగ్గరి దాకా వచ్చి వాయిదా పడ్డ పరిస్థితులున్నాయి. ఈసారి కూడా కోర్టు కేసు నేపథ్యంలో ప్రమోషన్లు, బదిలీలు జరుగుతాయో.. లేదోనని ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన ఉండేది. టెట్ విషయంలో రాష్ట్ర ఉన్నతాధికారులను హైకోర్టు మందలించడంతో ఇక ప్రమోషన్లు వాయిదా పడ్డట్లేనని భావించారు. కానీ.. అప్పటికే ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్లను ఇవ్వడంతో వారి దరఖాస్తులను పరిశీలించి జాబితాను జిల్లా అధికారులు సిద్ధంగా ఉంచారు. ప్రమోషన్లు, బదిలీలు హైకోర్టు ఆపమని చెప్పకపోవడంతో బుధవారం ఉదయం 3:30 గంటలకు ప్రమోషన్ల జాబితాను డీఈవో రవీందర్‌రెడ్డి విడుదల చేశారు. దీంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రమోషన్లు పొందినవారి వివరాలు

పీఎస్ హెచ్ఎంలు	52
ఎస్ఏ ఇంగ్లిష్	2
ఎస్ఏ గణితం	24
ఎస్ఏ హిందీ	92
ఎస్ఏ తెలుగు	103
ఎస్ఏ ఉర్దూ	04
ఎస్ఏ బయోసైన్స్	40
పీడీలు	27
ఎస్ఏ ఫిజికల్ సైన్స్	7
ఎస్ఏ సోషల్	62
స్పెషల్ ఎడ్యుకేషన్	3
మొత్తం	416

ఖానాపూర్‌కు 23 మంది..

ఖానాపూర్: ప్రభుత్వం కొత్తగా ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించగా జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి మండలంలోని పలు పాఠశాలలకు కొత్తగా 23 మంది ఉపాధ్యాయులు వచ్చారు. లాంగ్వేజ్ పండితులుగా ఉన్న తెలుగు, హిందీ సబ్జెక్టులలో స్కూల్‌అసిస్టెంట్లుగా ప్రమోషన్‌తో మండలానికి 10 మంది కొత్తగా వచ్చారు. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ బయో సైన్స్ ప్రమోషన్‌తో ముగ్గురు, ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీ ప్రమోషన్‌పై ఇద్దరు, ఎస్జీటీ నుంచి ఉర్దూ మీడియం ఎస్ఏ మ్యాథ్స్ ఒకరు, పీఈటీ నుంచి పీడీ ప్రమోషన్‌తో ముగ్గురు, ఎస్జీటీ నుంచి పీఎస్ హెచ్ఎం (ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం) లుగా ప్రమోషన్‌తో నలుగురు ఖానాపూర్‌కు వచ్చారని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో ఎస్టీటీలుగా ఉన్న ఆరుగురు ఉపాధ్యాయులు ప్రమోషన్‌పై వేరే పాఠశాలలకు వెళ్లారు.

ఇక బదిలీల పర్వం

ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో ఇక ఎస్జీటీల బదిలీలు ప్రారంభం కానున్నాయి. గత సెప్టెంబర్‌లోనే బదిలీల కోసం నోటిఫికేషన్ ఇవ్వగా.. కోర్టు కేసుతో ఆగిపోయింది. అయితే మళ్లీ ఆన్‌లైన్ ద్వారా బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు. బదిలీ కోరుకుంటే మాన్యువల్‌గా డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. పాయింట్ల ప్రకారం సీనియార్టీ జాబితా రెండు రోజుల్లో విడుదల కానుంది. ఆ తర్వాత ఖాళీలను ప్రదర్శించి వెబ్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేపడతారు.

'నులి'పేద్దాం..!

- నేడు జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం
- 19 ఏళ్లలోపు పిల్లలకు మాత్రలు వేసేందుకు సర్వం సిద్ధం

నిర్మల్‌చైన్‌గేట్: నులిపురుగు పిల్లల పాలిట శాపం. వ్యక్తిగత పరిశుభ్రత లోపించిన పిల్లల కడుపులో నులిపురుగు పెరుగుతూ.. బరువు తగ్గేందుకు కారణమవుతుంది. రక్తహీనత, పోషక లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, బలహీనంగా తయారవడం దీని లక్షణాలు. ఏలికపాము, నులి, కొంకి, ఇలా మూడు రకాల పురుగులు కలిగి ఉన్న పిల్లవాడు.. క్రమేనా బరువు తగ్గిపోతూ.. అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడతాడు. పిల్లల ఎదుగుదల, సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టి సారించిన ప్రభుత్వం ఏటా రెండుసార్లు నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తోంది. నేడు జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు మాత్రలు వేసేందుకు వైద్యారోగ్యశాఖ సర్వం సిద్ధం చేసింది. జిల్లాలో 1 నుంచి 19ఏళ్లలోపు వారు సుమారు 1,92,00 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ మాత్రలు వేయనున్నారు.

నులి పురుగుల వ్యాప్తి..

ఈగలు, దుమ్ము, ధూళి పడి కలుషితంగా మారిన తినుబండారాలను తీసుకోవడంతో పిల్లల కడుపులో నులిపురుగు వ్యాప్తి చెందుతుంది. కాళ్లకు చెప్పులు లేకుండా బహిరంగ ప్రదేశాలు, టాయిలెట్‌కు వెళ్లడం ద్వారా వచ్చే అవకాశం ఉంటుంది. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, వంట సరుకులను శుభ్రమైన నీటితో కడగకపోవడం, తినే ముందు, తిన్న తర్వాత చేతులు శుభ్రం చేసుకోకపోవడంతో అనేక అనర్థాలు ఉంటాయి. ఏడు రకాల నులి పురుగులు చిన్నారుల పొట్టల్లో స్థావరం ఏర్పరుచుకుని, వారి ఎదుగుదలలో ప్రభావం చూపిస్తాయి. జిల్లా, మండల టాస్క్‌ఫోర్స్ టీంల పర్యవేక్షణలో నులి మాత్రలు వేసే విధానంపై డాక్టర్లకు శిక్షణ ఇచ్చారు. విద్య, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, మున్సిపల్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం, ఇతర మతపరమైన పాఠశాలల భాగస్వామ్యంతో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ వందశాతం పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. ఇందుకు సంబంధించి 18 పీహెచ్‌సీల పరిధిలో 104 సబ్ సెంటర్లు ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది, 509 మంది ఆశ కార్యకర్తలు సేవలందించనున్నారు.

జిల్లాలోని విద్యాసంస్థలు	2003
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	18
పట్టణ పీహెచ్‌సీలు	3
చిన్నారుల సంఖ్య	1,92,000
బాలుర సంఖ్య	95,684
బాలికల సంఖ్య	96316



నివారణ చర్యలు

- భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలి.
- సురక్షిత, కాచి వడబోసిన నీటినే తాగాలి.
- తీపి పదార్థాలను పిల్లలకు దూరంగా ఉంచాలి.
- మలబద్ధకం రాకుండా చూసుకోవాలి.
- పీచుపదార్థాలున్న ఆహారం ఎక్కువగా ఇవ్వాలి.


చిన్నారులకు సగమే..

1–2 సంవత్సరాల వయస్సు వారికి సగం మాత్ర, 2 నుంచి 19 సంవత్సరాల వయస్సువారికి పూర్తి మాత్ర ఇవ్వనున్నారు. 2నుంచి 5 సంవత్సరాల వారికి మాత్రను ముక్కలు చేసి మింగించనున్నారు.

ఎదుగుదలకు అడ్డంకి..

చిన్నపిల్లల శరీరంలో తెలియకుండానే నులిపురుగులు ఉండడంతో శారీరక ఎదుగుదల లేకపోవడం, మానసిక ఎదుగుదల లేకపోవడం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. పేగుల్లో నులిపురుగులు ఉండడంతో తీసుకున్న ఆహారాన్ని అంతా అవే గ్రహించడంతో శరీరానికి పోషకాలందక ఎదుగుదల లోపిస్తుంది. దీంతో పాటు ఇతర అనారోగ్య సమస్యలూ తలెత్తే అవకాశముంది. పిల్లల్లో ఏకాగ్రత కూడా నశిస్తుంది. ముఖ్యంగా రెండేళ్ల పైబడిన పిల్లలు ఈ వ్యాధి బారిన పడే అవకాశాలున్నాయి. నులిపురుగులను శరీరంలో ఉన్నట్లు బయటపడడానికి సమయం పడుతుంది. పిల్లలు వయస్సుకు తగ్గ ఎదుగుదల, బరువు, మానసిక పరిపక్వత లేకపోవడం లాంటి సమస్యలుంటే వైద్యుడిని సంప్రదించి చికిత్స చేయించాలి. సకాలంలో గుర్తించి మందులు వాడితే నులిపురుగుల బారి నుంచి పిల్లలను కాపాడుకోవచ్చు. డీఈసీ మాత్రలను నిర్దేశించిన మోతాదులో వేసినట్లయితే వ్యాధి బారిన పడినవారు కోలుకోవడమే కాకుండా వ్యాధి రాకుండా ఉంటుంది.

విధిగా మాత్రలు మింగించాలి



1 నుంచి 19 సంవత్సరాల వయస్సులోపు వారందరికీ విధిగా ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలి. ఇందుకు తల్లిదండ్రులు చొరవ చూపాలి. ఆల్బెండజోల్ మాత్రలు మింగడంతో నులిపురుగులు చనిపోయి రక్తహీనత నుంచి బయటపడతారు.

– ధనరాజ్, డీఎంహెచ్‌వో

'కార్యకర్తలందరికీ అండగా ఉంటా'



పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న నగేశ్

ఖానాపూర్: పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పద్మశాలీ సంఘ భవనంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందనసభకు హాజరై మాట్లాడారు. ఏ అవసరమున్నా కార్యకర్తలు తనను సంప్రదిస్తే అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీతోపాటు మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమన్నను శాలువాలతో సన్మానించారు. అనంతరం పలువురు బీజేపీలో చేరగా వారికి ఎంపీ నగేశ్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. నాయకులు అంకం మహేందర్, నాయిని సంతోష్, టేకు ప్రకాశ్, ఆకుల శ్రీనివాస్, తోకల బుచ్చన్న, అనిల్‌రావు, ఉపేందర్, రవి, శ్రీనివాస్, రాజేశ్వర్, మనోజ్, రమేశ్, రవీందర్, సందీప్, రాజు తదితరులున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యేలు

భైంసాటౌన్: కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్‌ను బుధవారం కలెక్టరేట్‌లో నిర్మల్, ముధోల్ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్ కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లోని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

పత్తికి మరింత 'మద్దతు'

- క్వింటాల్‌కు రూ.500 పెంపు
- కనీస మద్దతు ధర ప్రకటించిన కేంద్రం
- వరికి నామమాత్రమే..

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం పంటల మద్దతు ధర పెంచుతూ రైతులకు తీపి కబురు అందించింది. 14పంటల ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు పెంచుతూ బుధవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి, వరి, సోయాబీన్, కంది పంటలు అధికంగా సాగవుతుండగా.. పెంచిన ధరలు సోయాబీన్, కంది పంటలకు కాస్త ఊరటనివ్వగా వరి పంట ధర రైతులను నిరాశకు గురి చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో 17.20లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. అధికంగా తృణధాన్యాలు, నువ్వు, పెసర పంటలకు ధర పెంచారు. కమిషనర్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్(సీఏసీపీ) సూచించిన ధరలు సాగుకయ్యే ఖర్చుకన్నా తక్కువగానే ఉన్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు అనుగుణంగా ధరలు పెంచాలని కొద్ది రోజుల క్రితం సీఏసీపీకి విజ్ఞప్తి చేశారు. రైతు కమిటీల సిఫారసుల ప్రకారం సాగుకు చేసే ఖర్చుకు అదనంగా మరో 50 శాతం కలిపి ధర ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. ఆయా పంటలకు రూ.117 నుంచి రూ.983 వరకు ధరలు పెరిగాయి. ఈ ఏడాదైనా పత్తికి క్వింటాల్‌కు రూ.8వేలు, వరికి రూ.3వేలు, సోయాకు రూ.6వేల వరకు చెల్లించాలని పలు రైతుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

పెరిగిన ధరలు (రూ.లలో) క్వింటాల్‌కు ఇలా

పంట	గతేడాది	ఈ ఏడాది	పెరిగింది
పత్తి	7,020	7,521	501
వరి(ఏ గ్రేడ్ రకం)	2,183	2,300	117
కంది	7,000	7,550	550
పెసర	8,558	8,682	124
సోయాబీన్	4,600	4,892	292
నువ్వులు	8,365	9,267	632
మొక్కజొన్న	2090	2,225	135
వేరుశనగ	6,377	6,783	406
జొన్న	3,225	3,416	191
మినుము	6,950	7,400	450
పొద్దుతిరుగుడు	6,760	7,400	450



సాగు భారం

విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల ధరలు, కూలీల ఖర్చు, వ్యవసాయ యంత్రాల ధరలు, ఇంధన ధరలు రెట్టింపు అయ్యాయి. వివిధ రకాల పంట సాగుకు పెట్టుబడులు వేలకు వేలు పెరుగుతూ వస్తున్నాయి. పత్తి పంటకు ఎకరాకు రూ.43 వేల వరకు, వరి, సోయా పంటలకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. సాగుకు సకాలంలో బ్యాంకు రుణాలు అందక అప్పు చేసి వేలల్లో నష్టపోతున్నారు. కనీసం కొద్దిపాటి దిగుబడి వచ్చినా పంటలకు ప్రభుత్వాలు మద్దతు ధరలతో రైతుకు అండగా నిలవడం లేదు. ఉమ్మడి జిల్లాలో 5.30 లక్షల మంది చిన్న, సన్నకారు రైతులు, మరో 55 వేల మంది కౌలు రైతులు వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్నారు. 70 శాతం వర్షాధారం పైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. ఈ ఏడాదైనా దిగుబడి వచ్చిన పంటలకు గిట్టుబాటు ధరలు లభిస్తాయని ఆశించిన రైతులకు మరోసారి నిరాశే ఎదురైంది.

రెండేళ్లలో పెరిగిన ధరలు

పత్తి సాగుకు రూ.35,000 నుంచి రూ.43,000, సోయాకు రూ.26,000 నుంచి రూ.30,000 వరకు, వరికి రూ.25,000 నుంచి రూ.32,000 వరకు పెట్టుబడి పెడుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు. పెట్టుబడి ఖర్చులతో పోల్చుకుంటే మద్దతు ధరలు ఏమాత్రం సరిపోవని పేర్కొంటున్నారు. గతంలో దుక్కి దున్నడానికి ట్రాక్టర్‌కు గంటకు రూ.700 ఉండగా పెరిగిన డీజిల్ ధరలతో ప్రస్తుతం రూ.1000, ఒక మనిషికి కూలి రూ.400 ఉండగా ఇప్పుడు రూ.600 తీసుకుంటున్నారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు పెరిగాయి.

రూ.8 వేలు ఉంటదనుకున్నా..



పత్తి సాగుకు ఏటికేటా వేలకు వేలు పెట్టుబడి పెరిగిపోతోంది. మద్దతు ధర ఏదో నామ్‌కే వాస్తే అన్నట్లు రూ.100, రూ.200 పెంచుతున్నారు. కూలీల ఖర్చు, ట్రాక్టర్‌కు డీజిల్ ధరలు పెరిగాయి. ఈ ఏడాది రూ.8 వేలు పైన ఉంటుందని అనుకున్నా. కానీ రూ.200 పెంచిండ్రు. ఇప్పటికైనా పునరాలోచించి ధరలు పెంచాలి.

– భీమరాజుల వెంకన్న, నెన్నెల

ఈ ధరలు నిరాశే..

గతంలో కూలీకి రూ.400 ఇస్తే అచ్చేటోళ్లు. ఇప్పుడు రూ.700 ఇస్తేగానీ రావడం లేదు. విత్తనాలు, ఎరువుల ధరలు బాగా పెరిగిపోయాయి. పది ఇరువై పెంచుతున్నరు. వేలకు వేలు పంటకు ఖర్చు అయితంది. గీ ధరలు గిట్టుబాటు కావు.

– పి.మురళి, హాజీపూర్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సోన్: భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

సోన్: మండలంలోని లెఫ్ట్‌పోచంపాడ్‌లోగల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను బుధవారం బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకంలో భాగంగా మంజూరు చేసిన రూ.13.50 లక్షలతో సైన్స్ ల్యాబ్ నూతన భవన మరమ్మతు, వివిధ అభివృద్ధి పనులకు గాను ప్రభుత్వం రూ.4.50లక్షలు విడుదల చేయగా పనులకు భూమిపూజ చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి విద్యార్థులు పాఠశాలకు చప్పట్లతో స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్క నాటారు. ప్రిన్సిపాల్ సరస్వతి మాట్లాడుతూ.. పాఠశాలలో ఒక్కటే ఆర్వో ప్లాంట్ ఉందని, అది విద్యార్థులకు సరిపోవడం లేదని చెప్పారు. తాగునీటి కోసం మరో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బర్ల మానసరెడ్డి, ఎంపీటీసీ మార మల్కవ్వ, ఎంపీవో కలీల్ హైమద్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీధర్, బీజేపీ నాయకులు సత్యనారాయణగౌడ్, సరికెల గంగన్న, హరీశ్‌రెడ్డి, మార గంగారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నాగరాజు, మారుతి, శ్రీను, సవిన్, అంజయ్య, ఉదయ్, రమేశ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సారంగపూర్ మండలం జామ్‌లో..

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలోగల సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల విద్యాలయంలో రూ.13.50 లక్షలతో చేపట్టిన సైన్స్‌ల్యాబ్ నిర్మాణానికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకులాల్లోనూ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలన్న ఉద్దేశంతో సైన్స్‌ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు సాహెబ్‌రావు, రాజేందర్‌రెడ్డి, గంగారెడ్డి, తిరుమలాచారి, పోతన్న, రాజేందర్, విలాస్, మధు తదితరులున్నారు.

సెల్‌ఫోన్ పోతే ఆందోళన వద్దు



సెల్‌ఫోన్లు ఇస్తున్న గోపీనాథ్, సైదారావు

నిర్మల్‌టౌన్: మొబైల్ ఫోన్ పోతే ఆందోళన వద్దని, సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో లేదా మీ సేవ కేంద్రం ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్బీ ఇన్‌స్పెక్టర్ గోపీనాథ్ సూచించారు. Dhttps://www.ceir.gov.in వెబ్‌పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీ తెలుసుకోవడం చాలా సులభమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న 31 మొబైల్ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో చౌకగా వస్తుందని, సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనేముందు సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫోన్ ఐఎంఈఐ నంబర్ నమోదు చేసుకోవాలని తెలిపారు. దొంగతనానికి లేదా ఫోన్లను వెతికి పెట్టడానికి పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తోందని తెలిపారు. అయితే టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొత్తగా ప్రవేశ పెట్టిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) అనే అప్లికేషన్ పోయిన ఫోన్‌ను వెతికి పెట్టడానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ అప్లికేషన్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వెబ్‌సైట్ ద్వారా ఇప్పటివరకు పోయిన 733 ఫోన్లను తిరిగి పట్టుకున్నట్లు తెలిపారు. ఖానాపూర్ సీఐ సైదారావు, ఏఆర్ ఎస్సై రవినాయక్, వివిధ ఠాణాల సిబ్బంది పాల్గొన్నారు.

'నిబంధనలు ఉల్లంఘించొద్దు'

నిర్మల్‌టౌన్: ఇసుక లారీల యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని గనుల శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లోగల ధర్మకాంట వద్ద ఆగి ఉన్న ఇసుక లారీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుక లారీలకు సంబంధించిన వే బిల్లులను పరిశీలించారు. పరిమితికి మించి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక తరలింపునకు అనుమతులు తప్పనిసరిని అని సూచించారు.

గ్యాస్ సబ్సిడీ.. నో!



భీంపూర్ మండలం తాంసి–కే గ్రామానికి చెందిన ఈమె పెందూర్ మౌనిక. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత రెండుసార్లు వంట గ్యాస్ సిలిండర్లు తీసుకుంది. అయితే ఈమె ఖాతాలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రాయితీ సొమ్ము జమ కాలేదు. గ్యాస్ ఏజెన్సీతో పాటు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించినా ప్రయోజనం లేకుండా పోయింది.



ఈ చిత్రంలోని కనిపిస్తున్నది బిర్కుర్‌వార్ సుజాత. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్ కాలనీవాసి. రెండు నెలలుగా వంట గ్యాస్ సిలిండర్లు తీసుకున్నప్పటికీ ఈమె ఖాతాలోనూ సబ్సిడీ జమకాలేదు. బ్యాంకులో సంప్రదించగా ప్రజాపాలన దరఖాస్తు కేంద్రంలో వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీలో వివరాలు అప్‌డేట్ చేసి రెండు నెలలవుతున్నా ఇప్పటికీ రాయితీ జమ కాకపోవడం గమనార్హం.

ఈ ఇద్దరే కాదు.. మహాలక్ష్మి పథకం కింద వంట గ్యాస్ సిలిండర్లు పొందిన జిల్లాలోని వేలాది మంది లబ్ధిదారులది ఇదే పరిస్థితి.

- ఖాతాల్లో జమకాని రాయితీ
- 'మహాలక్ష్మి' లబ్ధిదారుల ఆందోళన
- బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు
- సవరణలు చేసుకున్నా కలగని ప్రయోజనం

కైలాస్‌నగర్: గతేడాది(2023) డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద అర్హులైన వారందరికీ రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తామని ప్రకటించింది. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి రాయితీ సిలిండర్ అందజేయాలని గ్యాస్ ఏజెన్సీలకు ఆదేశాలు సైతం జారీ చేసింది. దీంతో అర్హులైన వేలాది మంది సంబంధిత ఏజెన్సీల నుంచి సిలిండర్లు పొందుతున్నారు. ఇందులో చాలామంది బ్యాంకుఖాతాల్లో రాయితీ జమ కావడం లేదు. దీంతో లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలు, మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డేటా అప్‌డేట్ చేసుకున్నా అందని రాయితీ

మహాలక్ష్మి పథకం కింద అర్హులైన వారి ఎంపిక కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులను స్వీకరించింది. సబ్సిడీ సిలిండర్ కోసం జిల్లా వ్యాప్తంగా 2.5లక్షలకు పైగా దరఖాస్తులు అందాయి. వీటిని ప్రభుత్వం ప్రజాపాలన వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేయించింది. అయితే ఆ సమయంలో ఆపరేటర్లు వివరాలను సరిగా నమోదు చేయకపోవడం, లబ్ధిదారులు గ్యాస్ కనెక్షన్, ఆధార్ వివరాలు సరిగా అందించకపోవడంతో చాలా మంది ఈ పథకం కింద లబ్ధి పొందలేకపోయారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం అలాంటి వారు వివరాలు సరిచేసుకునేందుకు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీంతో లబ్ధి చేకూరని వారంతా ఈ కేంద్రాల వద్ద బారులు తీరారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేసి వివరాలు సరిచేసుకున్నారు. అయినప్పటికీ వేలాది మందికి రాయితీ ఖాతాల్లో జమకావడం లేదని పేర్కొంటున్నారు.



సవరణలకు నో ఛాన్స్

ప్రజాపాలన కింద కొత్తగా దరఖాస్తు చేసుకుందామని భావించిన వారికి ప్రస్తుతం నిరాశే ఎదురవుతుంది. ప్రజాపాలన వెబ్‌సైట్‌ను జనవరి 6 తర్వాత నిలిపివేసిన ప్రభుత్వం తిరిగి తెరువలేదు. ఫలితంగా కొత్త దరఖాస్తుల స్వీకరణకే పరిమితమవుతున్నారే తప్ప వాటిని ఆన్‌లైన్ చేసే అవకాశం లేకుండా పోతోంది. అలాగే దరఖాస్తు సమయంలో తప్పుగా నమోదైన వివరాలు సైతం సరిచేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ కారణాలతో చాలామంది ప్రయోజనం పొందలేకపోతున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

24న ఐటీడీఏ ఎదుట ధర్నా



మాట్లాడుతున్న పుర్క బాపురావు

నేరడిగొండ: ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్కబాపురావు, రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. షెడ్యూల్డు ప్రాంతంలో మెగా స్పెషల్ డీఎస్సీతో పాటు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జీవో నం.3ను యథావిధిగా కొనసాగించడంతో పాటు ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలన్నారు. అలాగే పోడు రైతులకు పట్టాలు తదితర డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న ధర్నాలో ఆదివాసీ తొమ్మిది తెగల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు కోటేశ్వర్, హన్మంత్‌రావు, వినోద్, గణేశ్ తదితరులున్నారు.

యూపీఎస్సీ ర్యాంకర్‌కు సన్మానం



పల్సిబిలో సన్మానిస్తున్న గ్రామస్తులు

తలమడుగు: యూపీఎస్సీ ఇండియన్ ఫారెస్ట్ సైన్స్‌లో 131వ ర్యాంకు సాధించిన పల్సిబి గ్రామానికి చెందిన సాయి చైతన్య జాదవ్‌ను బుధవారం గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు యాదవ్ కిషన్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన యూపీఎస్సీ పరీక్షలో చైతన్య జాదవ్ ర్యాంక్ సాధించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో నిలిచి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ ఎరువు తిని ఐదు మేకలు మృతి



మృతిచెందిన మేకలు

భైంసారూరల్: మండలంలోని సిరాల గ్రామంలో కాంప్లెక్స్ ఎరువు తిని ఐదు మేకలు మృతిచెందాయి. వివరాలు.. బుధవారం సిరాల గ్రామానికి చెందిన వాగ్మారే దిలీప్ మేకల మందను తీసుకుని గ్రామ శివారులోకి వెళ్లాడు. పక్కనే ఓ పొలంలో వాడి పారేసిన కాంప్లెక్స్ ఎరువును మేకలు తిన్నాయి. దీంతో ఐదు మేకలు మృతిచెందాయి. ఐదు మేకలు మృతి చెందగా రూ.60వేల మేరకు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరాడు.

జప్తు చేసిన వాహనాల వేలం

భైంసాటౌన్: పలు నేరాల్లో జప్తు చేసిన వాహనాలకు భైంసా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయ ఆవరణలో జిల్లా అధికారి రజాక్ సమక్షంలో ఒక కారు, మూడు ద్విచక్ర వాహనాలకు వేలం వేశారు. దీంతో రూ.70వేల ఆదాయం సమకూరినట్లు సీఐ నజీర్ హుస్సేన్ తెలిపారు.

ఉసురు తీసిన అప్పు

- రుణం ఇచ్చిన వ్యక్తితో వాగ్వాదం
- మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

తానూరు: అవసరం కోసం స్నేహితుడి వద్ద తీసుకున్న అప్పే ఉసురుతీసింది. ఈ ఘటన మండలంలోని మొగ్లి గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగ్లి గ్రామానికి చెందిన జోడిదండి శివాజీ (31) అదే గ్రామానికి చెందిన జరికోటి శివరాజ్ వద్ద కొంతమొత్తం అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చే విషయంలో మంగళవారం రాత్రి ఇద్దరిమధ్య చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన శివాజీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శివరాజ్ కొట్టి అవమానించడంతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య సురేఖ బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



శివాజీ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నర్సాపూర్(జి): మండలంలోని గుండంపల్లి ఎక్స్ రోడ్డు సమీపాన 61వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ కాలనీకి చెందిన అద్దెకార్ క్రాంతికుమార్ (30) శ్రీకృష్ణ న్యూరో ఆస్పత్రిలో పీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నాడు. పని నిమిత్తం బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై నిర్మల్ నుంచి లోకేశ్వరం మండలానికి వెళ్తుండగా నర్సాపూర్(జీ) మండలం గుండంపల్లి ఎక్స్ రోడ్డు సమీపంలో 61వ జాతీయ రహదారిపై భైంసా నుంచి నిర్మల్ వైపు వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడైన క్రాంతికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువు బత్తుల నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు.



క్రాంతికుమార్ (ఫైల్)

గుడుంబా స్థావరాలపై 'ఎక్సైజ్' దాడులు


రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటి, కైరిగూడ గ్రామాల పరిసరాల్లో గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాటు చేసిన గుడుంబా స్థావరాలపై బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. బెల్లం పానకం ధ్వంసం చేసి గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గోలేటి, కైరిగూడ గ్రామ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్థావరాలపై దాడులు చేసి 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి, వారి వద్ద నుంచి 12 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా, అనుమతి లేకుండా మద్యం అమ్మకాల గురించి సమాచారం ఉంటే సమాచారం అందించాలని సీఐ దీపక్ కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు రమేశ్, సంధ్యారాణి, టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాజేశ్వర్, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు సురేశ్, కమలాకర్, మమత, రజిత, ధను, నవీన్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గుడుంబా తయారీ సామగ్రి

వరుస చోరీల దొంగ అరెస్టు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన నన్నెపురాజు చంద్రకాంత్ గత కొంతకాలంగా మంచిర్యాల నివాసం ఉంటూ జల్సాలకు అలవాటుపడ్డాడని తెలిపారు. అమ్మాగార్డెన్స్ ఏరియాలోని ఓ ఇంటితోపాటు మల్లికార్జుననగర్ ఏరియాలోని మరో ఇంట్లో ఇటీవల చోరీకి పాల్పడి రెండు ల్యాప్‌టాప్‌లు దొంగిలించాడని పేర్కొన్నారు. బుధవారం క్యాతనపల్లి వద్ద అనుమానాస్పదంగా కనిపించగా విచారణలో దొంగతనం విషయం బయటకు వచ్చిందని తెలిపారు. నిందితుడి నుంచి రెండు ల్యాప్‌ట్యాప్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.



అరెస్టయిన నిందితుడితో సీఐ, ఎస్సై

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- గజ్వేల్ సమీపంలో లారీని ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: హైదరాబాద్‌కు వెళ్లి వస్తుండగా గజ్వేల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆసిఫాబాద్ మండలం రహపల్లికి చెందిన యువకుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రహపల్లికి చెందిన ఆడే తిరుపతి(28), పోశన్న, రాములు కలిసి అనారోగ్యం బాధపడుతున్న అదే గ్రామానికి చెందిన చిన్మయ గిరిస్వామిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి ఈ నెల 18న కారులో తీసుకెళ్లారు. చిన్మయ గిరిస్వామిని ఆస్పత్రిలో అడ్మిట్ చేసిన అనంతరం వీరు ముగ్గురు అదే కారులో స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో గజ్వేల్ సమీపంలో ఆగి ఉన్న లారీని వీరు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముందు కూర్చున్న తిరుపతి అక్కడిక్కడే మృతి చెందగా.. పోశన్న, రాములు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా.. ఆడే తిరుపతికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



తిరుపతి(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఆవు మృతి

సారంగపూర్: మండలంలోని చించోలి(బీ) సమీపంలో గల మహబూబాఘాట్స్ సమీపంలోగల దర్గావద్ద ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బుధవారం రాత్రి ఆవును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన గ్రామస్తులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. బాధితురాలు తోతాబాయి ఆందోళన చేయగా ఆర్టీసీ బస్సు డ్రైవర్ సయ్యద్ షెఫిక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ అడ్మిషన్లు

నిర్మల్ రూరల్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు గురువారం నుంచి ఆన్‌లైన్ వెబ్ కౌన్సిలింగ్ ప్రారంభమవుతుందని కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్–2024 పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని నిర్మల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 23నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత కళాశాలలో సీటు కోసం వెబ్ ఆప్షన్ పెట్టడానికి కళాశాలలో కౌన్సిలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి

లింగాపూర్(ఆసిఫాబాద్): ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లాపటార్ గ్రామానికి మహమ్మద్ అఫ్సర్ (27) గ్రామ శివారులో బుధవారం ట్రాక్టర్‌తో వ్యవసాయ చేను దున్నేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ట్రాక్టర్ అదుపు తప్పి సమీపంలోని లోయలో బోల్తాపడింది. సమీపంలో ఉన్న అతడి సోదరుడు మహమ్మద్ హాకాని గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. లోయ నుంచి అఫ్సర్‌ను బయటికి తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి సోదరుడు హాకాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళను కొట్టిన కేసులో ముగ్గురికి జైలు

రామకృష్ణాపూర్: మహిళను కొట్టిన కేసులో ముగ్గురికి నెలరోజుల జైలుతోపాటు రూ.వేయి జరిమానా విధిస్తూ మంచిర్యాల ప్రిన్సిపల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ సంపత్ బుధవారం తీర్పునిచ్చినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పులిమడుగు గ్రామానికి చెందిన భూక్య బాబురావు, భూక్య భీమా, భ్యూక్య ప్రవీణ్‌లు అదే గ్రామానికి చెందిన భుక్య లక్ష్మిని 2021 జనవరిలో కొట్టి బెదిరించారని తెలిపారు. ఆర్‌కేపీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని, ఈ మేరకు నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష ఖరారు చేశారని తెలిపారు.

ఫర్టిలైజర్ షాపులో చోరీ

బెజ్జూర్(సిర్పూర్): బెజ్జూర్ మండల కేంద్రంలోని దీక్షిత ఫర్టిలైజర్ షాపులో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో చోరీ జరిగింది. షాపులో నుంచి రూ.2.38 లక్షల నగదు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకుడు కవ్వాల సాయి తెలిపారు. విషయం తెలుసుకున్న కౌటాల సీఐ సాదిక్ పాషా డాగ్స్‌స్క్వాడ్ సాయంతో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఆయన వెంట ఏఎస్సై మోహన్, కానిస్టేబుల్ విష్ణు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ఆదిలాబాద్‌టౌన్: ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో కేర్ హాస్పిటల్ సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆస్పత్రి ఎండీ ఆర్.చంద్రకిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్యనిపుణులు ఎస్.జగదీశ్వర్, కే. సంకల్ప్, విశ్వనాథ్, డి.సంతోష్, జయ జ్యోతి, రాజేశ్ పాల్గొని 300 మంది పోలీసు సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ స్పెషల్ బ్రాంచ్ పోతారం శ్రీనివాస్, సీఐలు కె.సత్యనారాయణ, డి.సాయినాథ్, ఎ.అశోక్, శ్రీనివాస్, కే.ఫణిధర్, ప్రణయ్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు టి.మురళి, ఎ.నవీన్ కుమార్, చంద్రశేఖర్, అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పోలీసు డాక్టర్ శాంతిరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.



డీఎస్పీకి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నిర్మల్ కలెక్టర్‌ను కలిసిన ఔట్‌సోర్సింగ్ ప్రతినిధులు

కైలాస్‌నగర్: నిర్మల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దుర్గం శేఖర్ ఆధ్వర్యంలో సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 2024–25 కోసం ఎంప్యానల్మెంట్ టెండర్లలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీలకు మాత్రమే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు రుక్మారెడ్డి, బాబాగౌడ్, శ్యాంరావ్, భాస్కర్‌గౌడ్ తదితరులున్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రతినిధులు

ప్రైవేటు పాఠశాల గోదాం సీజ్

- నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తున్నారని ఏబీవీపీ ఆందోళన

ఆదిలాబాద్‌రూరల్: మావల పరిధిలోగల న్యూ శ్రీచైతన్య పాఠశాలకు చెందిన పుస్తక గోదాంను అధికారులు బుధవారం సీజ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అధిక ధరలకు పుస్తకాలు విక్రయించేందుకు మావల మండల కేంద్రంలో ప్రత్యేక గోదాం ఏర్పాటు చేశారన్న విషయాన్ని ఏబీవీపీ నాయకులు తెలుసుకున్నారు. వెంటనే అక్కడికి చేరుకొని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న డీఈవో ప్రణీత అక్కడికి చేరుకున్నారు. సదరు పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసినా ఆయన రాకపోవడంతో మావల పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని డీఈవో సమక్షంలో వాటిని అదుపులోకి తీసుకొని గోదాంకు తాళం వేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు చేపట్టి, పుస్తకాలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

చిన్నారులపై పిచ్చికుక్క దాడి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సాయినగర్, రాజంపేట కాలనీల్లో బుధవారం పిచ్చికుక్కలు దాడులకు దిగాయి. రాజంపేట కాలనీల్లో ఆరుబయట ఆడుకుంటున్న ముగ్గురు చిన్నారులను ఓ కుక్క గాయపర్చింది. వీరిని కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు. తీవ్రంగా గాయపడిన రిషితోపాటు 11 నెలల అయాన్ష్‌ను వైద్యులు మంచిర్యాల ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఆశ్విత అనే ఎనిమిదేళ్ల చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా.. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ సిబ్బంది కర్రలతో కుక్కలను తరిమివేసేందుకు చర్యలు చేపట్టారు.



తీవ్రంగా గాయపడిన అయాన్ష్



చిన్నారి చేతిపై గాయం

వైద్యులపై దాడులు సరికాదు

మంచిర్యాలటౌన్: వైద్యులంటే ప్రాణాలు పోసేవారే గానీ ప్రాణాలు తీసేవారు కాదని, అకారణంగా వైద్యులను ఇష్టారీతిన దూషిస్తూ, దాడులు చేసేలా ప్రవర్తించడం సరికాదని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆర్ఎంవోలు శ్రీమన్నారాయణ, డాక్టర్ భీష్మ, ఎంసీహెచ్ గైనకాలజిస్టులతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల బెల్లంపల్లికి చెందిన గంగ మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ప్రసవించిన ఐదు రోజుల తర్వాత నడుం లేవడం లేదని అన్నారని, స్కానింగ్ కోసం తామే పంపిస్తే వివరాలు తెలుసుకోకుండానే నరం కట్ చేశారంటూ తమ వైద్యులపై 50మందికి పైగా ఒకేసారి ఆందోళనకు దిగారని అన్నారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి పంపిస్తే అక్కడి వైద్యులు అన్ని రకాల పరీక్షలు చేసి ఎలాంటి నరం కట్ కాలేదని, దీర్ఘకాలిక వ్యాధులు ఆపరేషన్ సమయంలో ఇలా బయటపడతాయని చెప్పారని, ప్రస్తుతం గంగ కోలుకుంటోందని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యులు నాగసింధు, అలివేణి, కీర్తిశ్రీ, ప్రశాంతి, ప్రసన్న, గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ పూర్తి చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్–2025(ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి బి.వినోద్‌కుమార్, బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు జి.ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 18 నుంచి ఏప్రిల్ 18, 2025 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారని, జూలై 3లోగా హైదరాబాద్‌లోని సైదాబాద్, లక్ష్మీనగర్ కాలనీలో టీజీబీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుంచి 100 మంది ప్రతిభావంతులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. వివరాలకు 08732–221280 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఐటీఐలో సర్వే పనులు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ ప్రభుత్వం ఐటీఐ ఆధునీకరణలో భాగంగా బుధవారం మంచిర్యాల ఐటీఐలో సర్వే పనులు ప్రారంభించారు. అడ్వాన్స్ ట్రెనింగ్ సెంటర్ కోసం పనులు చేపట్టారు. ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంటు(డీజెడ్ఎం) వై.ఉమామహేశ్వర్, కాంట్రాక్టర్ వేణు సర్వే చేశారు. పనులు పూర్తయితే భవనాలు, ఇతర ఆధునిక పరికరాలు అందుబాటులోకి వస్తాయని ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు.

పార్కింగ్ అస్తవ్యస్తం





కలెక్టరేట్ ఆవరణలో పార్కింగ్ స్థలం లేక క్యాంటీన్ ఎదుట వాహనాలు నిలుపుతున్నారు. కొందరు ఉద్యోగులు వారి వాహనాలను వరండాలో పార్కింగ్ చేస్తున్నారు. దీంతో కార్యాలయంలోకి వెళ్లాలంటే జనం ఇబ్బంది పడాల్సి వస్తోంది. అధికారుల స్పందించి క్యాంటీన్ ఎదుట పార్కింగ్ స్థలాన్ని నిషేధించాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

క్లుప్తంగా

అంగన్‌వాడీలకు శిక్షణ

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం ప్రాజెక్టు పరిధిలోని 35 కేంద్రాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సరిత మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని మూడు కేంద్రాలకు చెందిన టీచర్లకు మూడు రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీలత, నిర్మల, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు అందజేస్తా

లక్ష్మణచాంద: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తానని జెడ్పీటీసీ రాజేశ్వర్ అన్నారు. బుధవారం బడిబాట ముగింపు కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, పార్‌పెల్లి ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.2వేల నగదు ప్రోత్సాహకం అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశం రమేశ్, గోవర్ధన్, హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి

భైంసాటౌన్: హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు అన్నారు. ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం చేసిన రోజును పురస్కరించుకుని పట్టణంలోని నర్సింహా కల్యాణ మండపంలో బుధవారం హిందూ సామ్రాజ్య దివస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కారెగాం వినోద్‌కుమార్, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహా సంఘచాలక్ సాదుల కృష్ణదాస్, ప్రధాన వక్త, ఇందూర్ విభాగ్ ప్రచారక్ శివకుమార్‌తో కలిసి శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

దస్తురాబాద్: మండలంలోని ఎర్రగుంట గ్రామానికి చెందిన జాదవ్ రమేశ్ కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా తోటి మిత్రులు స్పందించి బుధవారం రూ.26,500 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు మహేష్, రాజు, రాజేశ్, మహేందర్, సాయి, చిట్టి, తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సీఐ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

నిర్మల్‌టౌన్: ఇటీవల నిర్మల్ పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్‌ను బుధవారం మున్సిపల్ కౌన్సిలర్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేడారం అపర్ణ ప్రదీప్, లక్కాకుల నరహరి, చైతన్య, మతిన్, అడప పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో బుధవారం గ్రామాల్లో ప్రబలే సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై సాంస్కృతిక కళాకారులు ప్రదర్శన, పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీవో శ్రీనివాస్ గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీణ, కళాకారులు సుధాకర్, రఘు, సుదర్శన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఖానాపూర్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హర్ష ఆస్పత్రి వైద్యులు ప్రశాంత్, శ్రావణ్ అన్నారు. బుధవారం మండలంలోని ఎర్వచింతల్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నిధుల్లేక నిలిచిన పనులు



మహలింగిలో అసంపూర్తిగా పంచాయతీ భవనం

- అర్ధంతరంగా ఆగిన పంచాయతీ భవన నిర్మాణాలు
- బిల్లులు రాక పనులు ఆపిన కాంట్రాక్టర్లు
- శిథిల భవనాల్లోనే కార్యాలయాల నిర్వహణ
- మండలంలో 31 గ్రామ పంచాయతీలు

తానూరు: గ్రామ స్వరాజ్యంలో గ్రామ పంచాయతీల పాత్ర విశిష్టమైంది. నిజాం కాలంలో సైతం భవనాలు లేకపోయినా రచ్చబండనే పంచాయతీగా మార్చుకుని గ్రామంలోని సమస్యలు పరిష్కరించేవారు. తర్వాత కాలంలో గ్రామానికో పంచాయతీ భవనం కేటాయించారు. తానూరు మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో కొన్ని పంచాయతీల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్ని గ్రామాల్లో భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యమో కాంట్రాక్టర్ల అలసత్వమో తెలియదు కానీ భవన నిర్మాణ పనులు మాత్రం అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో శిథిలావస్థకు చేరిన భవనాలు, పాఠశాల గదుల్లో సేవలు అందిస్తున్నారు.

భవనాల కొరత...



హిప్నెల్లిలో నిలిచిన జీపీ భవన నిర్మాణ పనులు

మండలంలోని 9 గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు ఉండగా 3 శిథిలావస్థకు చేరిన భవనాల్లో కొనసాగిస్తున్నారు. మిగితా 19 గ్రామ పంచాయతీలకు భవనాలు లేకపోవడంతో శిథిలావస్థకు చేరిన పాత భవనాలు, పాఠశాల భవనాలలో కొనసాగుతున్నాయి. అయితే ఆరేళ్ల క్రితం ప్రభుత్వం తొండాల, జౌలా(బి), సింగన్‌గాం, హిప్నెల్లి, బోల్సా, మహలింగి గ్రామాల్లో నూతనంగా భవన నిర్మాణ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు నిధులు సక్రమంగా రావడం లేదని పనులను అర్ధంతరంగా నిలిపేశారు. నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పడ్డ తొండాల, దాగాం, హిప్నెల్లితండా, బామ్నితండా గ్రామాల్లో పాత భవనాలు లేదా శిథిలావస్థకు చేరిన పాఠశాలల్లో పంచాయతీ కార్యాలయం కొనసాగిస్తున్నారు. జౌలా(బి), బెల్‌తరోడా, మహలింగి, బెంబర, సింగన్‌గాం, జౌలా(కే) గ్రామాల్లో ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. హిప్నెల్లిలో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన పాత పాఠశాల భవనంలో పంచాయతీని ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. నూతన భవనాలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బిల్లులు అందక...

మండలంలోని జౌలా(బి), తొండాల, మహలింగి, సింగన్‌గాం, హిప్నెల్లి, బోల్సా, గ్రామ పంచాయతీలకు సకాలంలో నిధులు అందకపోవడంతోనే భవన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. గతంలో భవనాలు పూర్తి చేయాలని అధికారుల ఆదేశాలతో పనులు సగం వరకు పూర్తి చేసినా ఇప్పటివరకు బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు అందిస్తే భవనాలు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. గతంలో ఆయా గ్రామాల సర్పంచులు పలుమార్లు అధికారులకు విన్నవించినా నిధులు లేవని సమాధానం ఇచ్చారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సకాలంలో బిల్లులు చెల్లించి భవన నిర్మాణాలు పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

మహలింగి, తొండాల, జౌలా(బి), సింగన్‌గాం, హిప్నెల్లి గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిన మాట వాస్తవమే. ఈ విషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల కాగానే భవన నిర్మాణాలు పూర్తి చేయిస్తాం.

– మోహన్ సింగ్, ఎంపీవో, తానూరు

పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తే చర్యలు



పాఠ్యపుస్తకాలు నిల్వ ఉంచిన గదిని సీజ్ చేస్తున్న ఎంఈవో సుభాష్

భైంసాటౌన్: ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాం, స్టేషనరీ వస్తువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈవో సుభాష్ హెచ్చరించారు. ఈ మేరకు పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం తనిఖీలు చేపట్టారు. అంతకు ముందు ఏబీవీపీ ఆధ్వర్యంలో పలు ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల విక్రయాలపై ఆందోళన చేపట్టారు. నో ప్రాఫిట్–నో లాస్ నిబంధన సాకుతో ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాల ఆవరణలోనే విక్రయాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ విషయం ఎంఈవో దృష్టికి తేవడంతో పాఠశాలలకు చేరుకుని పాఠ్య పుస్తకాలు నిల్వ ఉంచిన గదులకు తాళం వేసి సీజ్ చేశారు. వాసవి, శ్రీ గౌతమి, నారాయణ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

భూఆక్రమణల తొలగింపునకు సర్వే



సర్వే చేపడుతున్న రెవెన్యూ అధికారులు

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో పెద్దూర్ బస్టాండ్ నుంచి నాగమ్మ చెరువు వద్దకు వెళ్లే రహదారిని ఇరువైపులా ఉన్న రైతులు ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ ఇటీవల గ్రామస్తులు తహసీల్దార్ శ్రీదేవికి ఫిర్యాదు చేశారు. బుధవారం తహసీల్దార్ ఆదేశాల మేరకు మండల సర్వేయర్ యోహాన్ సర్వే చేపట్టారు. ఈసందర్భంగా ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 431లో 3ఎకరాల 30గుంటల భూమి ఉండగా అందులోంచి ఆక్రమణకు గురైన భూమిని సర్వే చేసి ఆక్రమిత భూమిని గుర్తించారు. మరో మూడు సర్వే నెంబర్లలో ఉన్న భూమిని ఇంకా గుర్తించాల్సి ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది సాగర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్

కుంటాల: కుంటాల ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ బుధవారం పంపిణీ చేశారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

దస్తురాబాద్: విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.1.10 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అంతకుముందు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. భూత్కూర్‌లో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ సింగరి కిషన్, వైస్ ఎంపీపీ రాజునాయక్, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

గంటలో ముగిసిన సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న పశు వైద్యాధికారి గోవర్ధన్

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం గంటలోపే ముగించేశారు. ఎంపీపీ కొండ్ర రేఖ అధ్యక్షతన జరిగిన చివరి సమావేశంలో అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మండల వ్యవసాయ అధికారి స్రవంతి మాట్లాడుతూ 2018–23 వరకు 140 మంది రైతు కుటుంబాలకు రైతుబీమా కింద రూ.5లక్షల చొప్పున పరిహారం అందించామన్నారు. పశు వైద్యాధికారి గోవర్ధన్ మాట్లాడుతూ పశువులు, గొర్రెలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి ఏపీవో జగన్నాథ్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు ఏప్రిల్ నుంచి జూన్ వరకు 2 లక్షల 25 వేల పనిదినాలు కల్పించామని, రూ.4కోట్ల 96 లక్షల వేతనాలు చెల్లించామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ చిన్నరామయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత, వైస్ ఎంపీపీ లక్ష్మి, ఎంపీటీసీలు మల్లేశ్, నర్సమ్మ, జంగుబాయి, మండల కో ఆప్షన్ మెంబర్ ఫసి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన



లక్ష్మణచాంద: ర్యాలీలో వైద్యురాలు ప్రత్యూష



లోకేశ్వరం: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ప్రత్యూష ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నట్టలను నిర్మూలించాలి

లోకేశ్వరం: ప్రతిఒక్కరూ నట్టలను నిర్మూలించాలని లోకేశ్వరం పీహెచ్‌సీ వైద్యురాలు తేజస్విని అన్నారు. బుధవారం మండలంలోని గడ్‌చాందలో నట్టల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు నట్టల నివారణ మందు తాగించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త దేవమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



భైంసారూరల్: దేగాంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



ఖానాపూర్: వేడుకల్లో పాల్గొన్న నాయకులు



భైంసాటౌన్: కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు దయానంద్, షబ్బీర్‌పాషా, పట్టణ అధ్యక్షుడు రమేశ్, నాయకులు రాజేందర్, మాజిద్, సలీంఖాన్, అమానుల్లాఖాన్, జన్నారపు శంకర్, తోట సత్యం, లక్ష్మీపతిగౌడ్, శంకర్, శ్రీనివాస్, రాజేశ్వర్, మీర్జాబేగ్ పాల్గొన్నారు.

భైంసాటౌన్: మాజీ ఎమ్మెల్యే బీ.నారాయణ్‌రావు పటేల్ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, పట్టణ అధ్యక్షులు షాహిద్, లతీఫ్, మాజీ సర్పంచ్ వినోద్, నాయకులు గోవర్ధన్, సాహెబ్‌రావు, విలాస్, నితిన్, శరత్ పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని దేగాంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నివాసంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజన్న, వెంకటేశ్, లక్ష్మణ్, అనీల్, పోతన్న, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ సంయుక్త కన్వీనర్ ఎంబడి రాజేశ్వర్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజర్, జిల్లా అధ్యక్షుడు జునైద్, పట్టణ అధ్యక్షుడు మతిన్ పాల్గొన్నారు.



నిర్మల్‌చైన్‌గేట్: వేడుకల్లో పాల్గొన్న నాయకులు

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు అబ్దుల్ హాదీ ఆధ్వర్యంలో 10కిలోల బరువు గల కేక్‌ను కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జావీద్, చిన్నారెడ్డి, సాజిద్, మసూద్, ఆత్రం లక్ష్మణ్, అహ్మద్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సుశీల్‌రెడ్డి

మామడ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సుశీల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్నందువల్ల వీధుల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించే విధంగా చూడాలన్నారు. పరిశుభ్రమైన తాగునీటిని వినియోగించే విధంగా ప్రజలకు సూచనలను చేయాలన్నారు. దోమల నివారణకు స్ప్రే చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ సుధాకర్, వైద్యాధికారి శ్రీకాంత్, సీహెచ్‌వో లస్మన్న, పంచాయతీ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

'నట్టల నివారణ' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి నాగరాజు

దస్తురాబాద్: మండల కేంద్రంలో నేడు నిర్వహించనున్న నట్టల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు నాగరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆశలు, అంగన్‌వాడీలు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 4,051 మంది పిల్లలు ఉన్నారని, వారందరికీ మాత్రలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపీడీవో రమేశ్, ఎంపీవో అనిల్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చిత్రకళ, ఆరోగ్య విస్తరణ అధికారి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు



ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్

లోకేశ్వరం: మండలంలోని సాథ్‌గాం గ్రామంలో ఉన్న పోచమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ.2 లక్షల జెడ్పీ నిధులు మంజూరైనట్లు జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన వీడీసీ సభ్యులకు ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్ అందజేశారు. ప్రహరీ నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని వారికి సూచించారు. ఈకార్యక్రమంలో నాయకులు బాయమొల్ల భోజన్న, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కుట్టుమిషన్లు అందజేత

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన నలుగురు మహిళలకు బుధవారం వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నాలుగు కుట్టుమిషన్లతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 104 మంది విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వరల్డ్ విజన్ జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఈ నెల 21న నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావే శం అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్న ట్లు ఎంపీపీ మోహిద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాన్ని తిరిగి ఈ నెల 24 న నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రత్యక్ష అనుభూతిపై అవగాహన

కుంటాల: మండలంలోని పెంచికల్ పాడ్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం హెచ్‌ఎం ఎల్లన్న ప్రత్యక్ష అనుభూతిపై అవగాహన కల్పించారు. పచ్చదనం, పరిసరాల పరిశుభ్రతపై క్షేత్రస్థాయిలో వివరించారు. ఎగబాకే మొక్కలు, దృఢంగా ఉండే మొక్కల గురించి తెలిపారు.

పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్‌లో మాజీ సర్పంచ్ నరేష్ నాయనమ్మ, అబ్దుల్లాపూర్‌లో చిన్నరెడ్డి, మండల కేంద్రంలోని మాజీ సర్పంచ్ కొందపూర్ భూమన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం బాధిత కుటుంబాలను ముధోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కన్వీనర్ సుదర్శన్ ఉన్నారు.

నేడు నులిపురుగు నివారణ మందులు పంపిణీ

సారంగపూర్: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేయనున్నట్లు స్థానిక వైద్యాధికారి వేదవ్యాస్ తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



2014-15 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు

కుంటాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2014–15 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పిల్లాపాపలతో కలిసివారు రోజంతా సరదాగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.